# మూడవ రోజు
## సెషన్ - 12
## మొగలిచెట్ల తాండా గ్రామ విజయ గాథ

**శిక్షణాంశము** : మొగలిచెట్ల తాండా గ్రామ విజయ గాథ

**ఉద్ధేశ్యము** : 1. వాటర్‌షెడ్ అమలులో మొగిలిచెట్ల తాండా గ్రామ ప్రజలు, గ్రామ పంచాయితీ, గ్రామ సంఘం ఏవిధంగా గ్రామాన్ని ప్రగతి బాటలో నడిపింప చేస్తున్నారో విశ్లేషణ చేయడం

**సమయం** : 30 ని.లు

**శిక్షణకు కావలసిన పరికరాలు** : కరపత్రం

**శిక్షణా పద్ధతి** :

| వ.సం. | శిక్షణాంశము | సమయం | పద్ధతి | కావలసిన పరికరములు |
|---|---|---|---|---|
| 1. | మొగలిచెట్ల తాండా గ్రామ విజయ గాథ | 330ని.లు | వీక్షణ, విశ్లేషణ | కరపత్రాలు, క్షేత్ర సందర్శ నకు వాహనము |

**పద్ధతి 1 : విజయ గాథ**

మొగిలి చెట్ల తాండా అనంతపురం జిల్లాలోని తనకల్లు మండలములో ఉన్నది. ఈ తాండాలోని మొత్తం కుటుంబాలు గిరిజన కుటుంబాలు. వీరంతా వ్యవసాయం మరియు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం మొత్తం వర్షాదారం మీద ఆధారపడి పండిస్తున్నారు. 1994 ప్రాంతములో సకాలంలో వర్షాలు రాక, పంటలు పండక తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. త్రాగడానికి నీరు దొరకడం కూడా చాలా కష్టంగా ఉండేది. ఆ పరిస్థితులలో అందరూ పొట్టకూటికోసము బెంగుళూరు, తిరుపతి, మద్రాసు, హైద్రాబాద్, బళ్ళారి మొదలగు పట్టణాలకు వలస వెళ్ళడం ప్రారంభించారు. మరికొంత మంది తమ పిల్లలను ప్రక్క గ్రామాలలో ఉన్న రైతుల ఇండ్లలో జీతాలకు పెట్టడం జరిగింది. చాలీ చాలని కూలీలతో వలస వెళ్ళిన ప్రాంతాలలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని, ఆరోగ్య సమస్యలతో సతమతమయినారు. గ్రామంలోకి అధికారులు వచ్చి మాట్లాడాలన్నా ఎవ్వరూ సహకరించేవారు కాదు. త్రాగుడు అలవాటు విపరీతంగా ఉండేది. ఈ విధంగా గ్రామంలోని ప్రజలు అన్ని రకాల ఇబ్యందులను ఎదుర్కొంటూ ఆర్థికంగా బాగా చితికిపోవడం జరిగింది.

ఈ తరుణంలో ఆ గ్రామానికి వాటర్‌షెడ్ అభివృద్ధి కార్య క్రమం ద్వారా 1995లో ఒక వాటర్‌షెడ్ పథకము మంజూరయినది. ఈ పథకమును అమలు చేయడానికి జన జాగృతి అనే స్వచ్ఛంధ సంస్థ వారు ఆ గ్రామమునకు రావడం జరిగింది. మొదట ఈ పథకము అమలు చేయడానికి కూడా ఆ గ్రామ ప్రజలు సక్రమంగా సహకరించే వారు కాదు. సంస్థ వారు ఒక సంవత్సరం కాలం పాటు వారితో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి వాటర్‌షెడ్‌పై అవగాహన తీసుకురావడం. గ్రామంలోని మహిళలతో పొదుపు సంఘాలు

మరియు యూత్ సంఘాలు, వాటర్‌షెడ్ కమిటీ, వాటర్ షెడ్ అసోసియేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది. దీని కంతటికీ ఒక సంవత్సరం పాటు కృషి చేయడం జరిగింది. వాటర్‌షెడ్‌లో పనులు మొదలు పెట్టాలంటే ఇందులో ప్రజల వాటా ఉండాలనేది ఉంది. దానికి మొదట ఎవరు సహకరించలేదు. తినడానికే కష్టంగా ఉండే మేము ఎక్కడ వాటా చెల్లిస్తాము అని వాళ్ళు చివరకి శ్రమ రూపంలో వారి కాంట్రిబ్యూషన్ చెల్లించారు.



ఆ విధంగా వాటర్‌షెడ్ కార్యక్రమాలు వలన ఆ గ్రామంలో మట్టికట్టలు, వంకలలో రాతికట్టలు, చెక్ డ్యాంలు కొండ ప్రాంతాలలో చెట్లు పెంచడము మొదలగు పనులు చేపట్టడం జరిగింది. ఈ పనులు చేపట్టడం ద్వారా గ్రామంలో ఇంతకు మునుపు వున్న పాత బోరు, బావులలో నీరు రావడం మొదలయింది. ఈ విధంగా ప్రజలలో ఈ కార్యక్రమం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఆశలు చిగురించాయి.

అలా వాటర్‌షెడ్ పనుల వలన గ్రామంలో వ్యవసాయోత్పత్తిలో మార్పులు మరియు మహిళా సంఘాలు పొదుపు వలన వారి చిన్న చిన్న ఆర్థిక సమస్యలు అధిక మించడానికి అవకాశాలు ఏర్పడినాయి. గ్రామంలోని ప్రజలందరూ ప్రతినెలా మావేశాలు ఏర్పాటు చేసుకొని వాటర్‌షెడ్ కార్యక్రమం ద్వారా జరిగే పనులు మరియు జరగబోయే పనులు గురించి చర్చించుకొని అందరూ కలిసి నిర్ణయాలు చేసుకొనే వారు. అలా జరుగుతున్న సమయంలో ఆ గ్రామమునకు మరో పథకం ఎ.పి. వెల్ అనే పథకము ఆ గ్రామమునకు వచ్చింది. ఇందులో భాగంగా ఒక 10 కమ్యూనిటీ బోర్ వెల్స్‌ను వేయడం జరిగింది. ఈ బోర్ల ద్వారా వ్యక్తిగతంగా కాకుండా ఒకే బోరు ద్వారా 5–6గురు రైతులు కలిసి నీటిని వాడుకోవాలని నిర్ణయించడం జరిగింది. ఈ నీటి వాడకంలో కూడా గ్రామ ప్రజలు కొన్ని కట్టుబాట్లు నియమనిబంధనలు పెట్టుకోవడం జరిగింది.



1. పంట ప్రణాళిక తయారు చేసుకోవడము
2. ప్రతి 15 రోజులకు ఒకసారి భూగర్భజల మట్టాన్ని కొలవడము.
3. నీటిని వాటాల రూపంలో వినియోగించుకోవడము
4. ఖర్చులు అన్ని అందరూ కలిసి భరించడము
5. ఆరుతడి పంటలు పండించడము.
6. కొత్త బోరు వేయకూడదు
7. అడవిలో ఎవ్వరూ చెట్లు కొట్టకూడదు
8. నీటి నిల్వ, నీటి సంరక్షణ పనులు చేపట్టాలి అనే మొదలగు కట్టబాట్లు నిర్ణయించారు.
9. అడవిలో మేకలను మేప రాదు, అడవిలో నిప్పు పెట్టరాదు, గడ్డి కోయరాదు.
10. కొత్త చెట్లను పెంచాలి.

అనే మొదలగు కట్టుబాట్లతో ఆ ప్రాంతమును బాగా సంరక్షించుకుంటూ దాని వలన వచ్చే కలపేతర అటవీ సంపదను సేకరించుకొని జీవనోపాధులు పెంపొందించుకుంటున్నారు. ఒకప్పుడు బోడి కొండలుగా వున్న కొండలలో ఈ రోజు మనిషి వెళ్ళడానికి కూడా అవకాశం లేకుండా వృక్ష సంపదను పెంపొందించడం జరిగిందంటే వారి ఐకమత్యమునకు వారికున్న పట్టుదలను ఏవరైనా మెచ్చుకోక తప్పదు. వాటర్‌షెడ్ కార్యక్రమంలో చేపట్టిన ప్రతి పని కూడా చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

ఈ విధంగా మొగిలిచెట్ల తాండా గ్రామ ప్రజలు ఒకప్పుడు తీవ్ర ఇబ్బందులతో సతమతవుచున్న పరిస్థితితులలో "వాటర్‌షెడ్" వలన వారి జీవన విధానంలో మార్పు రావడానికి వారు ఏర్పరచుకున్న కట్టుబాట్లు, ఐకమత్యము, భూగర్భజలాలు వినియోగించుకోవడంలో వారు తీసుకున్న చొరవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఒకప్పుడు వలసలు వెలుతూ, అనేక వ్యసనాలకు లోనవుతూ వున్న ప్రజలు కలసికట్టుగా ఉంటూ, వలసలు పోకుండా. పిల్లలకు మంచి చదువులు చెప్పించుకుంటూ. ఆరోగ్య విషయాలలలో కూడా మెరుగైన సేవలు పొందుచున్నారు. ప్రస్తుతము ఈ గ్రామానికే ఇతర గ్రామంలో ప్రజలు పనులకు రావడం జరుగుతున్నది. బడిపిల్లల కోసము తోట పెంపకము, కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడం, ప్రొద్దు తిరుగుడు మిషన్ కొనుగోలు చేయడం, ప్రతి ఇంటిలో గొర్రెలు పెంచుకోవడం, పిండిమర, గోబర్ గ్యాస్ ప్లాంటులు ప్రతి ఇంటి ముందు చెట్లు పెంచుకోవడం లాంటి అనేక కార్యక్రమాలు ఈ గ్రామ ప్రజలు చేసుకున్నారు. పిల్లల చదువు, ఆరోగ్యం కూడా మెరుగుపరుచుకోవడం జరిగింది. వేరే గ్రామాలకు వలస వెళ్ళే ప్రజలు ఇప్పుడు వారే ప్రక్క గ్రామాల ప్రజలకు పని కల్పించే స్థాయికి ఎదిగారంటే వారి కృషిని అభినందించ దగ్గ విషయం అని చెప్పవచ్చును.



కావున మిగతా గ్రామాలలో కూడా గ్రామ పంచాయితీ, గ్రామ సంఘం ప్రజల భాగస్వామ్యంతో మొగిలిచెట్ల తాండా గ్రామంలాగ ఐకమత్యము, కృషి, పట్టుదల, సామాజిక కట్టుబాట్ల ద్వారా నీటిని పొదుపుగా వాటాల రూపంలో సద్వినియోగము చేసుకుంటే ఎంతటి కరువు పరిస్థితులలో అయిన పంటలు సాగుచేసుకోవచ్చుననే విషయాన్ని గ్రహించి అందరూ కూడా ఆ దిశగా పయనిస్తారని కోరుకుందాం.

**శిక్షకులు ఈ క్రింది ప్రశ్నాపత్రాన్ని ఉపయోగించి వారు తెలుసుకున్న విషయాలను విశ్లేషించాలి.**

1. వాటర్‌షెడ్ వల్ల వారి ఊరికి ఏలాభం చేకూరింది?
2. వ్యవసాయం, పశువులకు సంబంధించి, ఏమేమి పనులు చేసుకున్నారు?
3. వారు ఏమి కట్టుబాట్లు పెట్టుకున్నారు?
4. సామాజిక కట్టుబాట్ల వలన రాబోయే కాలంలో గ్రామానికి ఎటువంటి మేలు జరుగుతుంది?

-:oOo:-

## మూడవ రోజు

## సెషన్ - 13

# సహజ వనరుల యాజమాన్యం, వ్యవసాయ, పశుగణ ఉత్పాదకత, జీవనోపాధుల కల్పన, పెంపుదలపై క్షేత్ర సందర్శన

**శిక్షణాంశము** : సహజ వనరుల యాజమాన్యం, వ్యవసాయ, పశుగణ ఉత్పాదకత, జీవనోపాధుల కల్పన, పెంపుదలపై క్షేత్ర సందర్శన

**ఉద్దేశ్యము** : 1. వాటర్‌షెడ్ అమలు గురించి క్షేత్ర సందర్శన ద్వారా ప్రత్యక్షంగా రైతులతోను, స్వయం సహాయక సంఘాలతోను చర్చ ద్వారా, పనులను వీక్షించడం ద్వారా అవగాహన ఏర్పర్చడం.

**సమయం** : 330 ని.లు

**శిక్షణకు కావలసిన పరికరాలు** : గమనించాల్సిన అంశాలకు సంబంధించిన కరపత్రం

**శిక్షణా పద్ధతి** :

| వ.సం. | శిక్షణాంశము | సమయం | పద్ధతి | కావలసిన పరికరములు |
|---|---|---|---|---|
| 1. | వాటర్‌షెడ్ అమలు గురించి క్షేత్ర సందర్శన ద్వారా ప్రత్యక్షంగా రైతులతోను, స్వయం సహాయక సంఘాలతోను చర్చ ద్వారా, పనులను వీక్షించడం ద్వారా అవగాహన ఏర్పర్చడం. | 330ని.లు | వీక్షణ, విశ్లేషణ | కరపత్రాలు, క్షేత్ర సందర్శనకు వాహనము |

**పద్ధతి 1 :**

ముందు రోజూ ఏ వాటర్‌షెడ్ నందు పై విషయాలు గమనించాలని శిక్షకులు అభిప్రాయ పడ్డారో ఆ గ్రామ పంచాయితీకి శిక్షణ పొందే వారి వివరాలు, ఎంత మంది ఆ గ్రామానికి వస్తున్నారో, ఏమేమి గమనించదలుచుకున్నారో, ఎవరెవరు ఆ గ్రామంలో చర్చకు అందుబాటులో వుండాలో, క్షేత్ర సందర్శన సమయంతో పాటు తెలియపరచాలి. క్షేత్ర సందర్శనకు వాహనాన్ని ఏర్పాటు చేసుకోవాలి, అందరు సమయానికి తప్పక వచ్చేటట్లు సూచన ఇవ్వాలి.

ఈ క్రింది కరపత్రం సమాచార సేకరణకు అనుకూలంగా శిక్షణ పొందే వారిని 4 లేదా 5 మందిని ఒక్కొక్క గ్రూపుగా చేసి వారికి అందజేయాలి. సహజ వనరులకు సంబంధించిన అంశాలను గమనించే గ్రూపుకు ఈ క్రింది సమాచారాన్ని సేకరించే విధంగా చూసుకోవాలి.

1. సహజ వనరుల ప్రణాళిక
2. వినియోగదారుల సంఘాల ఏర్పాటు, పనుల నిర్వహణ
3. సహజ వనరులపై స్వయం సంఘాలకు అవగాహన
4. చిన్న, సన్న కారు రైతులకు ఉపయోగపడే పనులు
5. వాటర్‌షెడ్ ట్రీట్‌మెంట్ పటం (మ్యాప్)
6. ఉమ్మడి సామాజిక వనరుల అభివృద్ధి

వ్యవసాయ, పశుగణ ఉత్పాదకత పెంపుదలకు సంబంధించిన గ్రూపుకు ఈ క్రింది విషయాలను గమనించమని తెలియజేయాలి.

1. భూసార వంతం సంరక్షణ, సమగ్ర చీడ పీడల నివారణ పనులు
2. వినూత్న పద్ధతులు అవలంభించడం, మౌలిక సదుపాయాల క్రింద ఏర్పాట్లు
3. పంట మార్పిడి విధానాలు
4. విత్తన ఉత్పత్తి
5. వ్యవసాయ ఋణాలు
6. రికార్డుల నిర్వహణ
7. పశు పోషణ, పశు వైద్య, పశు ఉత్పాదకత పెంపుదల
8. పశుగ్రాసం, పెరటికోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకం

జీవనోపాధులకు సంబంధించిన గ్రూపును ఈ క్రింది విషయాలను గమనించవలసినదిగా ప్రోత్సహించాలి.

1. పేదలను గ్రూపులలో చేర్చడం.
2. గ్రామ సంఘం నందు అన్ని గ్రూపులు చేర్చబడి ఉండటం.
3. శిక్షణలు, జీవనోపాధుల ప్రణాళిక
4. జీవనోపాధుల ఋణాలు, వివిధ జీవనోపాధులు
5. రికార్డుల నిర్వహణ
6. నైపుణ్యత పెంపుదల

**శిక్షకులకు సూచనలు :**

శిక్షకులు పైనున్న అంశాలను గమనంలో పెట్టుకోమని తెలియజేయాలి. ఏ గ్రామం అయితే వారు సందర్శిస్తున్నారో ఆ గ్రామంలో పై సమాచారానికి సంబంధించి ఏమి జరిగిందో గమనించమని తెలియజేయాలి. క్షేత్ర సందర్శన అనంతరం ఏ విధంగా వాటర్‌షెడ్ అమలు జరగాలి. ఆ గ్రామంలో జరిగిన మంచి విషయాలు ఏమిటి ఇంకా ఏ విషయాలలో శ్రద్ధ పెట్టాలి అనేదానిపై సమగ్ర చర్చ జరిపించాలి.

# అనుబంధము - శిక్షకులకు సూచనలు

శిక్షకులు మొదటిరోజు శిక్షణ పొందేవారి నుండి ఇద్దరిని ఎంపిక చేసి ఒకరికి ఈ క్రింది బాధ్యత అప్పజెప్పాలి.

- సభ్యులందరూ సమయం పాటించేలా చూడాలి.
- సెషన్ జరిగే సమయంలో అందరూ పాల్గొంటున్నారో లేదో చూడాలి.
- ఒకరిద్దరినే మాట్లాడనీయకుండా అందరూ పాల్గొనేలా చేయాలి.

ఇంకొకరు శిక్షణలో సెషన్ వారీగా నేర్చుకున్న అంశాలను సాయంత్రం కొంతసేపు వుండి లేదా భోజన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మర్నాడు ఉదయానికల్లా ముఖ్యమైన అంశాలతో నివేదికను రాసి ఉంచుకుని అందరికీ చదివి వినిపించాలి అని తెలియజేయాలి. రకరకాల ఆటలు, పద్ధతులను ఫెసిలిటేటరు తెలుసుకుని ఉండాలి. వారికి విషయం అర్థమయ్యేలా చిన్ని చిన్ని ఉత్సాహాన్నిచ్చే ఉదాహరణలు, పాటలు, ఆటలు ఉపయోగించాలి.

**శిక్షణా సమయంలో తీసుకొనవలసిన జాగ్రత్తలు, ఏర్పాట్లు:**

- ప్రతి బ్యాచ్ డేట్ల కంటే ముందుగా శిక్షణ పొందే వారికి సమాచారం అందిందో లేదో బాధ్యతగా అడిగి తెలుసుకోవాలి.
- వారు ఉండటానికి వసతి ఏర్పాట్లు, క్లాస్ రూమ్‌లో పద్ధతి ప్రకారం ఉండవలసిన పరికరాలు, బోర్డులు, సి.డి ప్లేయర్లు అన్నీ ముందు రోజు ఏర్పాటు చేయించాలి.
- ప్రారంభోత్సవంలో ఒకరు లేదా ఇద్దరు వ్యక్తుల క్లుప్త ప్రసంగాలతో నిరాడంబరంగా జరపడం మంచిది. సగం రోజును ఈ ఉత్సవాలు తినేయకుండా జాగ్రత్త పడాలి. ఆహ్వానించిన వారు శిక్షణాంశాల గురించే మాట్లాడితే మంచిది.

**సమీక్ష, విశ్లేషణ:**

టైము దొరికినపుడు వివిధ అంశాల్ని సమీక్షించడం మంచిది. మరోసారి ఆయా అంశాల్ని గుర్తు చేసినట్లు ఉంటుంది. వారి అవగాహనా స్థాయి అర్థం అవుతుంది. వారికి అర్థమయ్యేలా వారి మాండలిక పదాలతో అయితే బాగుంటుంది. శిక్షణ నిర్వాహకులు శిక్షణ పొందే వారందరూ తమకు ఆత్మీయులనే భావాన్ని ప్రారంభంలోనే నెలకొల్పాలి.

**భాగస్వామ్య పద్ధతి:**

మొత్తం అంశాలపై చెప్పే విషయం సూటిగా ఎదుటి వారికి చేరాలంటే వారు పాల్గొనాలి. వింటే మర్చిపోవచ్చు చూస్తే గుర్తుంటుంది. కాని పాల్గొంటేనే అర్థం అవుతుంది. చర్చ పద్ధతి కాని రోల్‌ప్లే కాని

ఏ పద్ధతిలో అయినా వారు పూర్తిగా పాల్గొనాలి. ఇది మాది అని భావించాలి. వారి మాటకు వారి చర్చకు ప్రతి వారు స్పందించాలి. అంశం పరిచయం చేసేటపుడు ఉపన్యాసం లా కాకుండా వీలయినంత వరకు ప్రశ్నలు వేసి వారి జవాబులేమిటో వినాలి. విషయాన్ని సమగ్రంగా పరిచయం చేయాలి. శిక్షణ ఇచ్చేవారు నెమ్మదిగా, స్పష్టంగా అందరికీ అర్థమయ్యేలా మాట్లాడాలి.

**గ్రూపు చర్చ:**

విషయాన్ని వీలయినంత సులభంగా వివరించాలి. మిగిలిన అరగంట వాళ్ళచేత ప్రశ్నలు అడిగించాలి. లేకుంటే ప్రశ్నాపత్రం తయారు చేసి ఇచ్చి గ్రూపుల వారిగా విడగొట్టి చర్చించమనాలి. గ్రూపు చర్చలో మాట్లాడగలిగిన వాళ్ళే డామినేట్ చేయకుండా జాగ్రత్త పడాలి. ఈ డామినేట్ గ్రూపు అభిప్రాయమే అందరి అభిప్రాయంగా ప్రకటించబడగూడదు. అందరూ (సమాన స్థాయిలో) తప్పనిసరిగా మాట్లాడటాన్ని ప్రోత్సహంచాలి. ప్రతి గ్రూప్ని ఒక రిసోర్స్ పర్సన్ దూరంగా కూర్చుని పరిశీలించడం అవసరం. అలా అని వారి చర్చల్లో అనవసరంగా జోక్యం చేసుకోకూడదు. గ్రూపులో ఒకరు చర్చల సారాంశాన్ని వ్రాయలి. ఒకసారి జరిగిన చర్చను ఒకరు మరొకసారి మరొకరు వ్రాయటం మంచిది. వ్రాయలేక పోయినా చర్చల సారాంశాన్ని బాగా చెప్పగల స్త్రీలు ఉంటే వారినే ప్లీనరీలో చెప్పమనాలి. ఇంకొకరు వ్రాసి ఉంచాలి. విషయ వివరణ కొరకు చార్టులు బొమ్మలు తయారు చేసుకోవటం అవసరం (చార్టుల విశ్లేషణకు టైమ్ ఇవ్వాలి.)

- చర్చకు ఇచ్చిన విషయాన్ని ఒకరు చదవాలి. తరువాత చార్టులు, బొమ్మలు చూడాలి.
- ప్రతి గ్రూపు ఒక్క దానిపై చర్చించి వారి సమాధానాల్ని ప్లీనరీలో చదవాలి. ఒక గ్రూపు అభిప్రాయాలు మరో గ్రూపు పరిశీలించవచ్చు.
- ఒక గ్రూపు చర్చిస్తున్నప్పుడు మరో గ్రూపు ఆ చర్చకు పరిశీలకులుగా వ్యవహరించి వారి రిపోర్ట్ చెప్పవచ్చు. అంటే అందరూ మాటాడేలా చర్చ ఎలా జరిగింది వంటి విషయాలు
- చర్చ ఎలా జరిగిందో కలిసి వారి వారి గ్రూపు చర్చల సారం చెప్పాలి. చెప్పిన దాన్ని విషయం/ అంశం పరిచయం చేసిన వారు సమన్వయం చేసి ముగించాలి.

**సాధించిన విజయాలు:**

మంచి మంచి కేస్‌స్టడీస్ అన్నీ ఉపయోగించిన సందర్భంలో ఉత్తేజకరంగా అందర్నీ వారు సాధించిన విజయాలు (గ్రామంలోనైనా, వాటర్‌షెడ్ అమలు లోనైనా) చెప్పమని ప్రోత్సహించాలి. ఇవన్నీ వింటే వారిలో వారిపై విశ్వాసం కలుగచేస్తాయి. ఏదైనా చేయాలి అనే తపన మొదలవుతుంది.

**పాటలు:**

శిక్షకులు పాటలు పాడాలి. నేర్పగలిగితే ఇంకా మంచిది. ఏ రోజు అంశంపై ఆ రోజు పాట వుంటే మంచిది.

**నమూనా సమావేశం-రోల్ ప్లే:**

వాటర్‌షెడ్ సమావేశం ఎలా జరుగుతుందో అలా జరగాలి. ఒకరు సర్పంచ్‌గా ఉంటాలి. గ్రామ సంఘం సభ్యులుగా ఇద్దరు వుంటారు. రైతులు, కూలీలు అందరూ ఉండాలి. సమావేశ నిర్వహణ ఎలా జరగాలో ముందుగా ప్రణాళిక ప్రకారం పనుల అమలు, ప్రాజెక్టు యాజమాన్య చక్రం ప్రకారం ఎవరు శిక్షణకు వెళ్ళాలి. జీవనోపాధులలో నైపుణ్యం ఎవరికి అవసరం, వ్యవసాయం, పశుగణ ఉత్పాదకత పెంపుదల సమస్యలు, పసుగ్రాస సమస్యలు, పనుల నిర్వహణ, నాణ్యత, స్త్రీ, పురుష సమాన భాగస్వామ్యం, పేదలకు ముందుగా చేయూతనివ్వడం మొదలగు అంశాలపై మాట్లాడేటట్లు అందరినీ సిద్ధం చేసుకోవాలి. ఊర్లలో సమావేశం జరిపేటపుడు నిర్వహణలో వచ్చే సమస్యలు అక్కడ సూచించబడేలా చూడాలి.

ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను అమర్చి వాటిపై ఇతరులను ఒప్పించడం వంటివి చేయాలి. గ్రామ సభ కూడా జరుపవచ్చు. ప్రజలు అడిగే సమస్యలను ఏ విధంగా కార్యరూపంలో పెట్టాలి. ఏ విషయాలకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలి అనే విషయాలను ఈ పద్ధతి ద్వారా గమనంలోనికి తీసుకుని రావాలి.

**లక్ష్యాలు:**

ప్రతి గ్రామంలో అనేక సమస్యలు ఉంటాయని ప్రతి సమస్యకు దాని ప్రత్యేకత వుంటుందని తెలియజేయాలి. ఏ సమస్యకు ఎంత ప్రాధాన్యతనిచ్చి చర్చించాలి, ఎలా పరిష్కార మార్గాలు వెదకాలి, అనేది రోల్ ప్లే ద్వారా చేయించాలి. అసలు మాట్లాడని వాళ్ళచేత మాట్లాడించాలి.

తమ బదులు కాని మరోకరు బదులు కాని ఎవరో పాల్గొనటం, నియమాలకు విరుద్ధం కాబట్టి వ్యతిరేకించాలని చెప్పాలి.

పద్ధతి: తమ అభిప్రాయాలు తెలిసినా లేకున్నా సభ్యులే సమావేశానికి రావాలి. స్వేచ్ఛగా చెప్పవచ్చుననే అభిప్రాయం కలిగించేలా రోల్ ప్లే ఉండాలి. శిక్షకులు ప్రేక్షకులుగా ఉంటే మంచిది. సమావేశం ఎలా ఉండకూడదో కూడా రోల్ ప్లే చేయించవచ్చు.

**బ్లాక్/వైట్ బోర్డులు:**

బ్లాక్‌బోర్డును ఉపయోగించేటప్పుడు పాటించవలసిన నియమాలు:

- ఒకే సారి అనేక విషయాలను బోర్డుపై వ్రాయకూడదు.
- పెద్ద అక్షరాలనుపయోగించాలి.
- వ్రాస్తూ మాట్లాడకూడదు. వ్రాయడం ముగించాక గ్రూప్ వైపు తిరిగి చర్చను సాగించాలి.
- రాత్రి వేళలో జరిగే సమావేశాలలో ఆకుపచ్చ బోర్డుపైన పసుపు రంగు చాక్‌పీసును ఉపయోగించినట్లయితే బావుంటుంది.
- బోర్డుకు అడ్డంగా నిలబడకుండా ఒక ప్రక్కన నిల్చోని స్కేలుని గాని లేక బెత్తమును గాని ఉపయోగించి మీరు దేని గురంచయితే చెపుతున్నారో దానిని సూచించాలి.

**శిక్షణ ఇచ్చే వారికి సూచనలు**

- మహిళల మనోభావాల్ని అర్థం చేసుకోవాలి. వారికి ఏది చెప్పినా వారి పరిసరాల్లో జరిగే సంగతులతో పోల్చి చెప్పాలి. వారి జీవితాల నుండీ ఉదాహరణలు ఇస్తే విషయం గుర్తుండిపోతుంది.
- మనం చేస్తున్న పనికి చెపుతున్న వాటికి మధ్య వైరుధ్యం ఉండకూడదు. అంటే అందరూ కలసి ఉండాలని చెప్పి మనం కాంపులో ఉండకుండా ఎక్కడో ఉండకోడదు. సౌకర్యమైనా అసౌకర్యమైనా వారితో కలసి భరించాలి. మాటకి చేతకి ఖచ్చితమైన పొంతన కన్పించాలి.
- వారికి మీరు ఎంత సమాచారం ఇచ్చారు అనే దాని కంటే వారు ఎంత అర్థం చేసుకున్నారు, ఏ మేరకు పాల్గొన్నారు అనేది ముఖ్యం. టైము గురించి హడావిడి పడి ఎక్కువ చెప్పాలనే తొందరలో అర్థం కాకుండా చెప్పకూడదు. మీనుండి వారు తెలుసుకోవాల్సింది ఎంత ఉందో వారి నుండి మీరు నేర్చుకోవాల్సింది అంతే ఉందని మీరు నమ్మితేనే మీరు వారికి మంచి ఫెసిలిటేటర్స్ కాగలరు.
- ప్రజల తెలివితేటలు శక్తి సామర్థ్యాలు మానవత్వం పట్ల పూర్తి నమ్మకం ఉండాలి. ఈ విశ్వాసం మనకు లేకపోతే మన పనిలో మన నిజాయితీ ప్రతిబింబించదు.
- సామాజిక మార్పులకు అనుగుణంగా మన అవగాహనా స్థాయిని పెంచుకోవాలి. మన లోపాలు సరిచేసుకోవాలి. సమయానుగుణమైన విశ్లేషణ చేయగలగాలి. మన శక్తి సామర్థ్యాలను ఇతరులకు బోధించేటపుడు చాలా ఎక్కువగా అభివృద్ధి చేసుకోగలం.
- మన జ్ఞానం, చైతన్యం చాలా ఎక్కువ స్థాయిలోఉందని అది గ్రామీణ స్త్రీలకు అందదని భావించకూడదు. మనం చెప్పేది వారికి అర్థం కాలేదంటే మనకు చెప్పడం రాలేదని అర్థం. ఇంకా చెప్పాలంటే వారికి ఏ మేరకు అర్థం అయ్యిందో అంతే మనం చెప్పగలిగామన్న మాట.
- మనల్ని ఎక్కువగా అంచనా వేసుకుని ఆ స్థాయికి అందరూ రావాలని భావించకండి. దీనివల్ల మనం నేర్చుకోవడం ఆగిపోయి స్తబ్ధత ఏర్పడుతుంది. నియంతలుగా మారి మన అభిప్రాయాల్ని అనుభవాల్ని ఇతరులపై బలవంతంగా రుద్ధి వారిని దూరం చేసుకుంటాము. ప్రజలకు అపారమైన అనుభవాలున్నాయి. వారి హక్కుల గురించి తెలియచెబితే ఐక్యంగా నిలబడి వారికి కావలసిన విధంగా ఈ సమాజాన్ని మార్చుకోగలరని మనం గుర్తుంచుకోవాలి.
- సమస్యలను వాటి స్వరూప స్వభావాల గురించి ఓ పద్ధతి ప్రకారం ఆలోచించి విశ్లేషించడానికి వారి గజి బిజి గందరగోళాన్ని ఒక క్రమంలోపెట్టడానికి మీ సహాయం వారికి అవసరం.
- అసలు సమస్య– మూలకారణం– దాని విస్తృతిపై సమాచారం ఆధారాలు విశ్లేషణ– పరిష్కరించడానికి జరిగిన ప్రయత్నాలు– మీరు సూచించే పరిష్కారం వెళ్ళాల్సిన దారి– ఎవరు, ఎలా, వివరాలు, బాధ్యతలు మొదలగునవి వివరంగా తెలియచెప్పాలి.

గ్రూపులో : సమానత్వం, ఐక్యతాభావన, వ్యక్తీకరణ స్వేచ్ఛా, ప్రజాస్వామ్య నిర్ణయం, పరస్పర గౌరవం, అభిప్రాయాల విలువకు ప్రాధాన్యత ఇచ్చి ఉండాలి.

కొన్ని సార్లు గ్రూపులోని వారు తమ భావాల్ని సరిగా వ్యక్తీకరించలేకపోవచ్చు. అపార్థాలు తలెత్తవచ్చు. ఆసక్తి చూపకపోవచ్చు. అందరూ ఒకేసారి మాట్లాడటానికి ప్రయత్నించవచ్చు. నాయకుల అభిప్రాయాన్ని ఉదాసీనంగా ఆమోదించవచ్చు. వీటిని సమన్వయపరచాలి. చర్చల నుండి ఆత్మవిశ్వాసం పొందాలి. విభజనలు తొలగాలి. సంఘటిత శక్తి పట్ల నమ్మకం కలిగి వ్యక్తి పోకడలు తగ్గాలి. అయితే ఇవన్నీ ఒకేసారి సాధ్యం కాదని గుర్తించండి. ఇందులో పేర్కొన్న అంశాలన్నీ అభ్యాసం చేయించే తీరుపై మన విజయం ఆధారపడి ఉంది.